ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 88 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 30 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## ఏపీలో 'ఉచిత గ్యాస్ సిలిండర్' ప్రారంభం.. స్వయంగా టీ చేసిన

# సీఎం చంద్రబాబు

ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభమైంది. దీపం 2.0లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారు.



**ఇచ్ఛాపురం, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభమైంది. దీపం 2.0లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారు. మహిళా లబ్ధిదారు శాంతమ్మ ఇంటికి వెళ్లి ారు. ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేశారు. అనంతరం స్వయంగా స్టవ్ వెలిగించి టీ చేసి తాగారు. శాంతమ్మ కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం మరో లబ్ధిదారు ఇంటికి వెళ్లి ఒంటరి మహిళ పింఛను అందజేశా- ఆ కుటుంబానికి ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. రేపటి నుంచే పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ను సీఎం ఆదేశించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కొక్కటిగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం:

# మంత్రి దుర్గేశ్

ఏపీలో గత వైకాపా పాలనలో ఎన్నో సమస్యలు పేరుకుపోయాయని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు.

**ఉండ్రాజవరం, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో గత వైకాపా పాలనలో ఎన్నో సమస్యలు పేరుకుపోయాయని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఐదేళ్లుగా నెలకొన్న సమస్యలను ఒక్కసారిగా పరిష్కరించడం సాధ్యం కాదని తెలిపారు. తూ-ర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలిసి మంత్రి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని చెప్పారు.రాష్ట్రంలో అధ్వానంలో ఉన్న రహదారులన్నింటినీ ప్రక్షాళన చేసే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు 2వ తేదీ నుంచి చేపడుతున్నారని వెల్లడించారు. పంచాయతీరాజ్ ఆర్అండ్బ, ఇతర శాఖలకు చెందిన రహదారుల్లో గుంతలను పూడ్చే కార్యక్రమం చేపడుతున్నారు. రహదారులతోపాటు డ్రైనేజీలు నిర్మిస్తామని చెప్పారు. నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని రహదారులకు కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి



చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని మోదీల సారథ్యంలో రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతుందని మంత్రి వెల్లడించారు.

## మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

వైకాపా మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై విజయవాడకు చెందిన మహిళ తాడేపల్లి సీఐ కల్యాణ్కు ఫిర్యాదు చేశారు.



**తాడేపల్లి, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై విజయవాడకు చెందిన మహిళ తాడేపల్లి సీఐ కల్యాణ్కు ఫిర్యాదు చేశారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.90 లక్షలు తీసుకొని మోసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ఇవ్వాల్సిన డబ్బును అడిగితే.. 'విశాఖలో గిరిజన టీచర్ను స్లో పాయిజన్ ద్వారా చంపేశానని, నీకు అదే గతి పడుతుందని' నాగార్జున వ్యక్తిగత సహాయకుడు మురళీ బెదిరిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. తనకు రావాల్సిన రూ.90 లక్షలను ఇప్పించాలని కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలు స్వీకరించిన ఎస్పీఎఫ్

తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) స్వీకరించింది.



**హైదరాబాద్, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్** తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) స్వీకరించింది. ఎస్పీఎఫ్నకు చెందిన 214 మంది ఈ రోజు నుంచి సచివాలయం భద్రత బాధ్యతలు చేపట్టారు. గేట్లు, ఇతర ప్రాంతాల్లో సాయుధ గార్డు, లోపల గస్తీ వంటి బాధ్యతలను ఎస్పీఎఫ్ నకు ప్రభుత్వం అప్పగించింది. ఎస్పీఎఫ్ కమాండెంట్ దేవీదాస్ నేతృత్వంలో భద్రత సిబ్బంది ఇవాళ సచివాలయం ఆవరణలో పూజలు నిర్వహించి బాధ్యతలను స్వీకరించారు. సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట్లో ఎస్పీఎఫ్ భద్రత నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ 25న భద్రత నిర్వహణను తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)కు అప్పగించారు. అయితే భద్రతతోపాటు అగ్నిప్రమాదాల నుంచి రక్షణ వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఎస్పీఎఫ్నకు సచివాలయం భద్రత బాధ్యతలు అప్పగించాలని ఆగస్టు 5న ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదించారు. డీజీపీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం భద్రత బాధ్యతలను టీజీఎస్పీ నుంచి తీసుకోవాలని ఎస్పీఎఫ్ను ఆదేశించింది.

## రూ.6 లక్షలు ఖర్చుపెట్టినా.. దక్కని చిన్నారి ప్రాణం

బుడి బుడి అడుగులు వేస్తూ.. వచ్చీ రానీ మాటలతో ముద్దుముద్దుగా మాట్లాడే తమ చిన్నారిని జ్వరం కబళించడంతో ఆ ఇంట విషాదం నెలకొంది.

**ఉరవకొండ, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** బుడి బుడి అడుగులు వేస్తూ.. వచ్చీ రానీ మాటలతో ముద్దుముద్దుగా మాట్లాడే తమ చిన్నారిని జ్వరం కబళించడంతో ఆ ఇంట విషాదం నెలకొంది. ఈ ఘటన అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో చోటుచేసుకుంది.కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీకి చెందిన మారుతి, మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత పది రోజులుగా మారుతి కుమార్తె ఆరాధ్య(6) తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. దీంతో ఆమెను ఉరవకొండలోని పలు ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించినా జ్వరం తగ్గలేదు. వైద్యుల సూచన మేరకు నాలుగు రోజుల క్రితం ఆరాధ్యను బెంగళూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. బెంగళూరులో చిన్నారి వైద్యానికి రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినప్పటికీ తమ కుమార్తె మృతి చెందిందని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్నారి మృతితో శివరామిరెడ్డి కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## బుద్ధవనంలో పెండింగ్ పనులపై ఆరా తీసిన

# మంత్రి జూపల్లి

రానున్న రోజుల్లో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్లో స్టార్హోటల్ను నిర్మించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.



**నాగార్జునసాగర్, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** రానున్న రోజుల్లో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్లో స్టార్హోటల్ను నిర్మించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగార్జున సాగర్లోని బుద్ధవనాన్ని పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్తో కలిసి మంత్రి పరిశీలించారు. బుద్ధవనంలో పెండింగ్లో ఉన్న పనుల వివరాలపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వ అనుమతితో ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో స్టార్హోటల్ను నిర్మించి పర్యాటకులకు ఆహ్లాదకరమైన కాటేజీలను నిర్మించనున్నట్లు తెలిపారు. సాగర్ను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, జలాశయంలో వాటర్ బోట్లను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## ఎక్సైజ్ పీఎస్లో విచారణకు హాజరైన రాజ్ పాకాల

జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో నిందితుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్పాకాల అలియాస్ పాకాల రాజేంద్రప్రసాద్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ పీఎస్ లో విచారణకు హాజరయ్యారు.

**హైదరాబాద్ , నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో నిందితుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిదిరాజ్పాకాల అలియాస్ పాకాల రాజేంద్రప్రసాద్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ పీఎస్లో విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో కలిసి వచ్చిన రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. విదేశీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి వద్ద కొనుగోలు చేశారనే అంశాలపై ప్రధానంగా విచారిస్తున్నట్లు సమాచారం. బుధవారం రాజ్ పాకాలను 7గంటలకు పైగా మోకిల పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఆయన ఫోన్ను స్వాధీనం చేసుకుని స్టేట్మెంట్ రికార్డు చేసిన అనంతరం విడిచిపెట్టారు. బీఎన్ఎస్ఎస్ 35 (3) సెక్షన్ కింద మరోసారి పిలిస్తే విచారణకు రావాలని పోలీసులు సూచించారు. ఈ



నేపథ్యంలో ఇవాళ ఎక్సైజ్ పోలీసుల ఎదుట రాజ్ పాకాల విచారణకు హాజరయ్యారు.

## 'పుష్ప' తరహాలో స్మగ్లింగ్.. ట్యాంకర్లో లో తరలిస్తున్న గంజాయి పట్టివేత

కుమురం భీం జిల్లా వాంకిడి అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది.





**వాంకిడి, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** పుష్ప సినిమాలో.. పాల ట్యాంకర్లో ఎర్రచందనం తరలిస్తున్న సీన్ గుర్తుందా? అదే ప్లాన్ను గంజాయి స్మగ్లర్లు అమలు చేశారు. కాకపోతే.. పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఆదిలాబాద్ జిల్లాలో వెలుగు చూసిన ఈ ఘటన పుష్ప సినిమాలోని ఎర్రచందనం స్మగ్లింగ్ సీన్ను గుర్తు చేసింది. కుమురం భీం జిల్లా వాంకిడి అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం పోలీసుల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.. కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏపీలో రాజమహేంద్రవరం నుంచి మధ్యప్రదేశ్కు వెళ్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా కనిపించడంతో చెక్పోస్టు వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ట్యాంకర్ మధ్య భాగంలో ప్రత్యేకంగా తాయారు చేసిన అరల్లో 290 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.72.50లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్ బల్వీర్ సింగ్ను అరెస్టు చేశామని, ప్రధాన నిందితులను పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## శంషాబాద్ ఎయిర్పోర్టులో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

**హైదరాబాద్, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** శంషాబాద్ విమానాశ్రయంలో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 7.096 కిలోల హైడ్రోఫోలిక్ వీడ్ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



శంషాబాద్ విమానాశ్రయంలో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

## పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో

# పాదయాత్ర: కేటీఆర్

భారాస కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.



**హైదరాబాద్, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్):** భారాస కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపమని అన్నారు. ప్రస్తుత పాలన ఫ్రం దిల్లీ, టూ దిల్లీ, ఫర్ దిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. హస్తం పార్టీ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని చెప్పారు. ప్రజలపక్షాన కొట్లాడటమే ప్రస్తుతం తమముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. "పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయి పాదయాత్ర నిర్వహిస్తా. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకి మార్గదర్శనం చేస్తున్నారు. పార్టీ నేతలపై వేధింపులు, అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. మా సోషల్ మీడియా వారియర్లు అద్భుతంగా పని చేస్తున్నారు" అని కేటీఆర్ తెలిపారు.కాంగ్రెస్ దళారీ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవడం, పంట కొనుగోళ్లపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. వానాకాలం వరి కోతలు సాగుతున్నప్పటికీ.. రైతుబంధు, రైతుభరోసా ఊసే లేదని ఆక్షేపించారు. కనీసం పంట కొనుగోలు చేయడం లేదని.. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. ఈ సీజన్లో 91 లక్షల 28 వేల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి.. అక్టోబర్ 28 వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నులు ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. 'రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో చూడండి' అని వ్యాఖ్యానించారు. దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడం లేదని.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మిల్లుల కేటాయింపు జరగలేదని కేటీఆర్ విమర్శించారు. సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు ప్రక్రియ నిలిచిందన్నారు. రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెడుతుంటే... ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాత్రం డైవర్షన్ పాలిటిక్స్లో బిజీబిజీగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# త్వరలోనే రెడ్బుక్ మూడో చాప్టర్ : నారా లోకేశ్

**రెడ్బుక్లో రెండు చాప్టర్లు ఓపెన్ అయ్యాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.**





అట్లాంటా, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): రెడ్బుక్ రెండు చాప్టర్లు ఓపెన్ అయ్యాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. "చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కచ్చితంగా సినిమా చూపిస్తాం. సందేహం లేదు.. త్వరలోనే రెడ్బుక్ మూడో చాప్టర్ కూడా తెరుస్తాం. యువగళం పాదయాత్రలో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. రెడ్బుక్కు భయపడుతున్న జగన్.. గుడ్బుక్ తీసుకొస్తానంటున్నారు. బుక్ ఏమి రాయాలో ఆయనకు అర్థం కావట్లేదు. గతంలో సోషల్మీడియాలో పోస్టు పెడితే కేసులు పెట్టి లుకౌట్ నోటీసులు ఇచ్చేవారు. నోటీసులకు భయపడకుండా ఎన్ఆర్ఐలు నిలబడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్రానికి పెట్టుబడులు కూడా తీసుకెళ్లాలి. సంక్షేమం అంటే ఏమిటో ఎన్టీఆర్ చూపించారు. ప్రపంచంలో తెలుగువారు తలెత్తుకొని తిరిగే పరిస్థితి తీసుకొచ్చారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎప్పుడూ ముందుంటాం. మీరు ఎన్ఆర్ఐలు కాదు.. ఎంఆర్ఐలు అని పిలుస్తా. ఎంఆర్ ఐ అంటే 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్' అని అర్థం. ఏపీలో కూటమి గెలుపు ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క తెలుగువారిది" అని లోకేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, ఎన్ఆర్ఐ తెదేపా నేత కోమటి జయరాం పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సమయంలో అభిమానులు హెలికాప్టర్ నుంచి పూలవర్షం కురిపించారు.

# ప్రముఖ ఆర్థికవేత్త బిబేక్ దెబ్రాయ్ కన్నుమూత

**ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో అధ్యక్షుడిగా విధులు నిర్వహిస్తున్న బిబేక్ దెబ్రాయ్ (69) కన్నుమూశారు.**



నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): ప్రముఖ ఆర్థికవేత్త బిబేక్ దెబ్రాయ్ (69) మృతిచెందారు. ప్రధాని ఆర్థిక సలహామండలికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న బిబేక్ శుక్రవారం హఠాత్తుగా మరణించారు. దెబ్రాయ్ మృతికి ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. డా. దెబ్రాయ్ నాకు చాలాకాలంగా తెలుసు. ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు, ఆధ్యాత్మికత ఇలా ఎన్నో విభిన్నరంగాల్లో ఆయనకు ఎంతో ప్రావీణ్యం ఉంది. ప్రజా విధానానికి ఆయన చేసిన కృషి అతీతం. ప్రాచీన గ్రంథాలపై పనిచేయడం అంటే ఆయనకు ఎంతో ఇష్టం. యువత కోసం వాటిని అందుబాటులోకి తెచ్చారు. ఆయన మృతి నన్ను ఎంతో బాధించింది. ఆయన కుటుంబసభ్యులకు, స్నేహితులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి' అని మోదీ పేర్కొన్నారు. దెబ్రాయ్ మృతికి కేంద్ర మంత్రి దర్మేంద్ర ప్రదాన్ విచారం వ్యక్తంచేశారు. దెబ్రాయ్ గతంలో కోల్కతాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో విధులు నిర్వహించారు. ఆ తర్వాత పూణేలోని గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్లో ఛాన్సలర్, ఢిల్లీలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్లో విధులు నిర్వహించారు. ఆ తర్వాత పలు ఇన్స్టిట్యూట్లలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2019 వరకు దెబ్రాయ్ నీతి అయోగ్లో సభ్యుడిగా ఉన్నారు. పలు పుస్తకాలు, కథనాలు రచించడంతో పాటు పలు వార్తాసంస్థలకు సంపాదకులుగా వ్యవహరించారు. ఆర్థికశాస్త్రంలో దెబ్రాయ్ చేసిన సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది.

# చందానగర్ పరిధిలో తనిఖీలు.. రూ.18 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం

**చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు డ్రగ్స్ పట్టుకున్నారు.**



హైదరాబాద్ , నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు డ్రగ్స్ పట్టుకున్నారు. నిందితుడి నుంచి 155 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్కు చెందిన కృష్ణారామ్ గురువారం హైదరాబాద్కు వచ్చాడు. తనతో పాటు ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు లింగంపల్లి గుల్ మోహర్ పార్క్ వద్ద ఇంట్లో తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు కృష్ణారామ్తో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.18 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

# దోచుకున్న ఆస్తులు కాపాడుకునేందుకే జగన్ తాపత్రయం: గంటా

**దోచుకున్న ఆస్తులు కాపాడుకునేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ తాపత్రయపడుతున్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు.**



విశాఖపట్నం, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): దోచుకున్న ఆస్తులు కాపాడుకునేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ తాపత్రయ పడుతున్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఆ పార్టీ మునిగిపోయిన నావ అని.. ఒకరిద్దరు కూడా అందులో మిగలరని చెప్పారు. విశాఖపట్నంలోని తన నివాసంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. వాలంటీర్లు లేకుండా పింఛన్ల పంపిణీ సాధ్యం కాదన్న వైకాపా నేతలు ఇప్పుడు చూస్తున్నారా? అని వ్యాఖ్యానించారు. "భవిష్యత్తులో అన్న క్యాంటీన్లలో భోజనం ఉచితంగా అందించే ఆలోచన ఉంది. అధ్వాన రోడ్లపై దృష్టి పెట్టాం.. అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నాం. విశాఖకు మరిన్ని ఐటీ కంపెనీలు వచ్చేలా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. నగర అభివృద్ధిపై శనివారం సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తారు. స్టీల్ప్లాంట్ అంశంలో చిత్తశుద్ధితో ఉన్నాం" అని గంటా శ్రీనివాసరావు అన్నారు.

# వైజాగ్ టు విజయవాడ.. 16 జన్సాధారణ్ ప్రత్యేక రైళ్లు.. టైమింగ్స్ ఇవే!

**పండుగ సీజన్ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.**



నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): పండుగ సీజన్తో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. విశాఖ-విజయవాడ మధ్య 16 జన్సాధారణ్ (అన్ రిజర్వ్డ్) రైళ్లను నడుపుతున్నారు. నవంబర్ 1 నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. విశాఖ విజయవాడ జన్సాధారణ్ ఎక్స్ప్రెస్ (08567) రైలు నవంబర్ 1, 3, 4, 6, 8, 10, 11, 13 తేదీల్లో విశాఖలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకోనుంది. అలాగే, విజయవాడ - విశాఖ ప్రత్యేక రైలు (08565) విజయవాడలో సాయంత్రం 6.30 గంటలకు - బయల్దేరి రాత్రి 12.35 గంటలకు విశాఖ చేరుకోనుంది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ గడువు మరోసారి పొడిగింపు?

**కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన కమిషన్ గడువును తెలంగాణ ప్రభుత్వం మరోసారి పొడిగించనుంది. ఈ కమిషన్ ప్రస్తుత గడువు నేటితో పూర్తికానుంది.**



హైదరాబాద్, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ ను నియమించింది. దీనిపై వంద రోజుల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకు అనుగుణంగా జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, మొదటి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వం పొడిగించిన గడువు నేటితో పూర్తికానుంది. అయితే, జస్టిస్ పీసీఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లకు సంబంధించిన క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ జరపాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వ పెద్దలను కూడా దర్యాప్తు చేసేందుకు కమిషన్ సిద్ధమవుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగింపు ఇస్తూ ఇవాళో.. రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది.

# 'లోగుట్టు ఆ కుటుంబానికే ఎరుక..' తెదేపా ఆసక్తికర పోస్ట్

**తెదేపా 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేసింది. గతంలో.. ఖరీదైన కారు రెండు టైర్లు ఊడిపోయిన ఫొటోను షేర్ చేస్తూ పేర్కొన్న వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.**



అమరావతి, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): తెదేపా 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేసింది. గతంలో.. ఖరీదైన కారు రెండు టైర్లు ఊడిపోయిన ఫొటోను షేర్ చేస్తూ పేర్కొన్న వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రోడ్డు పక్కన ఉన్న ఈ ఖరీదైన కారు ఎవరిదో కాదు.. వందల మందిని తనకు రక్షణగా పెట్టుకుని తిరిగే రూ. లక్షల కోట్ల ఆస్తిపరుడు జగన్ మోహన్రెడ్డి తల్లి విజయా రాజశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం ఇది. సరికొత్త, అత్యాధునిక సెక్యూరిటీ హంగులు ఉన్న కారు. అయినప్పటికీ ఒకేసారి రెండు చక్రాలు ఊడిపోయాయి. ఇంకా నయం ఆమెకు ప్రాణాపాయం తప్పింది. ఇంత హై ఎండ్ కారు.. అదీ కొత్త కారుకి ఇలా జరగడం చూసి.. ముందు ఆశ్చర్యపోయి, తర్వాత మన సైకో బ్యాక్ గ్రౌండ్ తెలిసి, ఏం జరిగిందో చాలా మంది ఊహించారు. ఇదంతా జరిగింది 2024 ఎన్నికల ముందు. 2019 ఎన్నికలకు బాబాయ్ను లేపేసినట్టే.. ఈ ఎన్నికలకు మరో పెద్ద తలకాయను జగన్ టార్గెట్ చేస్తాడేమో అని ఏపీ ప్రజలు అనుకుంటున్న సమయంలో ఇది జరిగింది. తర్వాత ఏడాది పాటు విజయా రాజశేఖర్ రెడ్డి అమెరికాలోనే ఉన్నారు. లోగుట్టు ఆ కుటుంబానికే ఎరుక!" అని తెదేపా ట్వీట్ చేసింది.

# లారీ-ఆటో ఢీ.. ఇద్దరి మృతి

**లారీ, ట్రాలీ ఆటో ఎదురెదుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా ఆత్కూర్ క్రాస్ రోడ్డ వద్ద జరిగింది.**

జి.కొండూరు, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): లారీ, ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన ఆత్కూర్ క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జి.కొండూరు మండలానికి చెందిన 13 మంది కూలీలు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో బొప్పాయి కోతకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ట్రాలీ ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో ఆత్కూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా వస్తున్న లారీ, ట్రాలీ ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మైలవరం మండలం పుల్లూరు గ్రామానికి చెందిన కొనకళ్ల నాగరాజు(20), ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఉయ్యాల సాయికుమార్(27) మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో మిగిలిన కూలీలు క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఆ ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు.

# ఏలూరులో పేలుడు.. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పార్థసారథి

**ఏలూరులో బాణసంచా తీసుకెళ్తుండగా భారీ పేలుడు సంభవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుధాకర్ కుటుంబ సభ్యులను మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పరామర్శించారు.**



ఏలూరు, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): ఏలూరులో బాణసంచా తీసుకెళ్తుండగా భారీ పేలుడు సంభవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుధాకర్ కుటుంబ సభ్యులను మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పరామర్శించారు. ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. దీపావళి పండగ పూట ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. పార్టీ తరపున రూ. లక్ష, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.2 లక్షల ఎక్స్గ్రేషియా, మృతుడు భార్యకు ఔట్సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

# స్థానిక పోలీసులకు సహకరించాలి : సీపీ ఆనంద్

**హైదరాబాద్ లో శాంతిని నెలకొల్పడానికి పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు.**

హైదరాబాద్, నవంబర్ ,01 (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని అన్ని జోన్ల నుంచి వచ్చిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీలతో బంజారాహిల్స్లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సమావేశం నిర్వహించారు. ఇక ముందు కూడా ఆయా ప్రాంతాల్లో పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా కొనసాగుతూ అవసరమైన సేవలు అందించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతోపాటు స్థానిక పోలీసులకు సహకరించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కమిటీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# రిషభ్ శెట్టికి థాంక్స్ చెప్పిన ప్రశాంత్వర్మ

రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తోన్న చిత్రం జై హనుమాన్'. దీపావళి కానుకగా ఈ సినిమా ఫస్టుక్ పోస్టర్ విడుదలైంది.




'శ్రీ రాముడికి హనుమంతుడు ఇచ్చిన మాట ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానంగా తెరకెక్కుతోన్న చిత్రం 'జై హనుమాన్'. ప్రశాంత్వర్మ దర్శకత్వంలో ఇది రూపుదిద్దుకుంటోంది. ఆంజనేయ స్వామి పాత్రలో కన్నడ నటుడు రిషభ్ శెట్టి కనిపించనున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా ఫస్టుక్ పోస్టర్ విడుదల చేయగా దానికి విశేష ఆదరణ లభించింది. ఈనేపథ్యంలో తన ప్రాజెక్టో భాగమైన రిషబ్ శెట్టికి ధన్యవాదాలు చెప్పారు ప్రశాంత్ వర్మ. శుక్రవారం పోస్ట్ పెట్టారు. "ఈ ప్రాజెక్టలో భాగమైన, జాతీయ అవార్డు అందుకున్న నటుడు రిషభ్ శెట్టికి ధన్యవాదాలు. హనుమాన్పై ఆయనకున్న భక్తి మరియు అసమానమైన అంకితభావం ఈ పాత్రకు నిజంగా జీవం పోశాయి. అద్భుతమైన పరివర్తన, పరిపూర్ణత, తిరుగులేని నిబద్ధత 'జై హనుమాన్'ని అసాధారణమైనదిగా ఆయన మార్చారు. ప్రపంచవ్యాప్తంగా తన అభిమానులకు మరపురాని అనుభూతిని అందించడానికి ఆయన అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు. మీతో కలిసి ఈ ప్రయాణాన్ని ఆరంభించినందుకు ఆనందంగా ఉంది" అని రాసుకొచ్చారు. ఫస్ట్ లుక్ ఫొటోషూట్కు సంబంధించిన ఫొటోని ఆయన పంచుకున్నారు. తేజ సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్'. సంక్రాంతి కానుకగా ఈ ఏడాది విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. దీనికి కొనసాగింపుగా ఇప్పుడు 'జై హనుమాన్' సిద్ధమవుతోంది. 'హనుమాన్'కు మించి ఈ సినిమా ఉంటుందని ఇప్పటికే దర్శకుడు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆంజనేయ స్వామి పాత్రలో ఎవరు నటించనున్నారనే విషయంలో ఎంతోమంది స్టార్ హీరోల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు ఈ అవకాశం రిషబ్ శెట్టికి దక్కింది. ఇందులో తేజ సజ్జా హనుమంతు పాత్రలో కనిపించనున్నారు. మరోవైపు 'హనుమాన్' తో 'ప్రశాంత్ సినిమాటిక్ యూనివర్స్'ను క్రియేట్ చేశారు. 'జై హనుమాన్'తోపాటు 'అధీర', 'మహాకాళి' కూడా అందులో భాగం కానున్నాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఎట్టకేలకు ఆ వ్యక్తిని కలిసిన హృతిక్ రోషన్.. ఫొటో వైరల్


అగ్ర కథానాయిక నయనతార జీవితంపై డాక్యుమెంటరీ సిద్ధమైన విషయం తెలిసిందే. తాజాగా దీని స్ట్రీమింగ్ డేట్ను నెట్ఫ్లిక్స్ ప్రకటించింది.



బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ పై తనకున్న ప్రేమను విభిన్నంగా చాటుకున్నాడు ఓ వ్యక్తి. కొన్నిరోజుల పాటు ఎదురుచూసి చివరకు అభిమాన హీరోతో ఫొటో దిగాడు. దీనికి సంబంధించిన ఫొటోను ఇన్స్టాలో షేర్ చేస్తూ ఆనందం వ్యక్తంచేశాడు. హరియాణాలోని ఫరియాబాద్కు చెందిన జాదు (ఇన్స్టా ఖాతా పేరు) అనే వ్యక్తికి హృతిక్ అంటే ఎంతో ఇష్టం. ఈ విషయాన్ని తెలియజేసేలా తరచూ సోషల్మీడియాలో పోస్టులు పెడుతుండేవాడు. ఈ క్రమంలోనే హృతిక్ను కలవాలని నిర్ణయించుకున్నాడు. కొన్ని రోజుల క్రితం తన స్వగ్రామం నుంచి ముంబయికి సైకిల్పై ప్రయాణించాడు. దాదాపు 1000 కిలోమీటర్లు ప్రయాణించిన అతడు హీరోని కలవడం కోసం ఆయన ఇంటి ముందు నాలుగు రోజులుగా పడిగాపులు కాశాడు. ఈ విషయం తెలుసుకున్న హృతిక్ తాజాగా అతడిని కలిశారు. కారులో ప్రయాణిస్తోన్న ఆయన.. ఇంటి బయట ఎదురుచూస్తోన్న అభిమానిని దగ్గరకు పిలిచి కాసేపు మాట్లాడి ఫొటోలకు పోజులిచ్చారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో నెట్టింట వైరల్గా మారింది. హృతిక్ సూపర్హిట్ మూవీ 'కోయిమిల్గ్యా'లో ఏలియన్ లుక్ను తాను రీ క్రియేట్ చేశానని అభిమాని తెలిపాడు. ఇక సినిమాల విషయానికి వస్తే.. 'ఫైటర్ తో ఈ ఏడాది ప్రేక్షకులను అలరించారు నటుడు హృతిక్ రోషన్. ఆయన 'వార్ 2' కోసం వర్క్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఎన్టీఆర్ కీలకపాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. వచ్చే ఏడాది విడుదలయ్యే అవకాశం ఉంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1915 : ప్రముఖ రచయిత, ప్రజా ఉద్యమనేత వట్టికోట ఆళ్వారుస్వామి జననం (మ.1961).
- 1919 : ప్రముఖ చిత్రకారుడు, శిల్పి అంట్యాకుల పైడిరాజు జననం (మ.1986).
- 1945 : భారతీయ హేతువాది, మహారాష్ట్రకు చెందిన రచయిత నరేంద్ర దభోల్కర్ జననం (మ.2013).
- 1956 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొట్ట మొదటి ముఖ్యమంత్రిగా నీలం సంజీవ రెడ్డి ప్రమాణ స్వీకారం.
- 1959 : ఆంధ్ర ప్రదేశ్ లో పంచాయితీ రాజ్ వ్యవస్థ ప్రవేశపెట్టబడింది.
- 1973 : ప్రముఖ భారతీయ సినిమా నటి, మాజీ విశ్వ సుందరి ఐశ్వర్య రాయ్ జననం. (చిత్రంలో)
- 1974 : భారతదేశ క్రికెట్ క్రీడాకారుడు వి.వి.యెస్.లక్ష్మణ్ జననం.
- 1989 : తెలుగు సినిమా నటుడు హరనాథ్ మరణం (జ.1936).
- 1996 : సంగీత విద్వాంసుడు మల్లాది వెంకట సత్యనారాయణ రావు మరణం (జ.1932).


వట్టికోట ఆళ్వారుస్వామి


పైడిరాజు


నరేంద్ర దభోల్కర్


నీలం సంజీవ రెడ్డి


ఐశ్వర్య రాయ్


వి.వి.యెస్.లక్ష్మణ్


హరనాథ్


వెంకట సత్యనారాయణ రావు

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# కేఎల్ రాహుల్ రిలీజ్

## .. సంజీవ్ గొయెంకాపై భారీగా ట్రోలింగ్


ఐపీఎల్ రిటెన్షన్లపై ఎల్ఎస్ జీ యజమాని సంజీవ్ గొయెంకా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.



ఐపీఎల్ 2025లో రిటెన్షన్ జాబితాలో చోటుదక్కని పెద్ద స్టార్ కేఎల్ రాహుల్ ఒక్కడే. లఖనవూ సూపర్ జెయింట్స్ యాజమాన్యం నిర్ణయంపై ఇప్పుడు భారీగా ట్రోలింగ్ మొదలైంది. ఆ జట్టు నికోలస్ పూరన్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్, మొహసిన్ ఖాన్ వంటివారిని జట్టులో కొనసాగించింది. ఐపీఎల్ రిటెన్షన్లకు ముందు ఎల్ఎసీ యజమాని సంజీవ్ గొయెంకా మాట్లాడుతూ.. "ఆటగాళ్ల ఎంపికలో మేము ఒక్కటే విషయాన్ని పరిగణనలోకి తీసుకొన్నాం. గెలవాలన్న లక్ష్యంతో ఉన్నవారినే ఎంపిక చేశాం. వ్యక్తిగత లక్ష్యాలకు దూరంగా జట్టు విజయం కోసం శ్రమించేవారికే ప్రాధాన్యమిచ్చాం. మా తొలి రిటెన్షన్ నిర్ణయం కేవలం రెండు నిమిషాల్లోనే తీసుకొన్నాం. మేము అన్క్యాప్డ్ ప్లేయర్లు మొహసిన్ ఖాన్, ఆయుష్ బదోనిని కూడా కొనసాగించాము. ఈ మొత్తం ప్రాసెస్ను జహీరాఖాన్, జస్టిన్లాంగర్, సీఈవో, అనలిస్ట్ కలిసి పర్యవేక్షించారు. గత సీజన్లోని ముగ్గురు భారతీయ బౌలర్లు మాకు అవసరం. పూరన్ ఎంపికలో రెండో ఆలోచనకు తావులేదు. ఇక 6, 7 స్థానాల్లో ఆయుష్ మాకు బాగా ఉపయోగపడ్డాడు" అని పేర్కొన్నారు. 'వ్యక్తిగత లక్ష్యాలు' అంటూ సంజీవ్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇది కేఎల్ రాహులు ఉద్దేశించి చేసినవే అని అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాఖ్యలపై భారత మాజీ ఆటగాడు దొడ్డా గణేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశాడు. "ఇదొక వెర్రిమాట" అని అభివర్ణించాడు. " కేఎల్ రాహుల్ నిస్వార్థంగా జట్టు కోసం ఆడే ఆటగాడు. అతడిని మాత్రం వదిలేశారు" అని మరో యూజర్ పేర్కొన్నారు. ఇలా పలువురు నెటిజన్లు గొయెంకా వ్యాఖ్యలను తప్పు పడుతున్నారు. గత ఐపీఎల్లో హైదరాబాద్ మ్యాచ్ అనంతరం సంజీవ్-కేఎల్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అది కాస్తా లైవ్లో ప్రసారమైంది. ఆ తర్వాత ఇది వైరల్ కావడంతో చాలామంది గొయెంకా తీరును తప్పుపట్టారు. కెప్టెన్తో మైదానంలో వాదనకు దిగడం సరికాదని పేర్కొన్నారు. ఆ తర్వాత గొయెంకా కూడా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

## ఫ్యాషన్

అందంగా, స్టైలిష్గా కనిపించేందుకు నేటి యువత ఎన్నో తంటాలు పడుతున్నారు. ఫ్యాషన్ సెన్స్ బాగా పెరిగింది. కేవలం అమ్మాయిలు మాత్రమే కాదు.. అబ్బాయిలు కూడా డ్రెస్సింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అయితే, అమ్మాయిలతో పోలీస్తే అబ్బాయిలు ఈ విషయంలో కాస్త వెనుకంజలో ఉన్నారు. అమ్మాయిలు అందంగా కనిపించడానికి రకరకాల ఫ్యాషన్ డ్రెస్సులు ధరిస్తారు. అదే, అబ్బాయిలు బాడీ పెంచడంపై దృష్టి పెడతారు. కానీ, డ్రెస్సింగ్ విషయంలో మాత్రం అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు ఫ్యాషన్ సెన్స్ తక్కువనే చెప్పాలి. చాలా మంది అబ్బాయిలు ఏ డ్రెస్సులు పడితే అవి వేసేస్తారు. కానీ, ఈ రోజుల్లో అందంగా, స్టైలిష్గా ఉన్నవారికే డిమాండ్ ఎక్కువ. డ్రెస్సింగ్ విషయంలో అబ్బాయిలు గందరగోళంగా ఉంటారు. అయితే, స్టైలిష్తో పాటు కూల్గా కనిపించాలంటే.. అబ్బాయిలు కొన్ని చిట్కాలు ఫాలో కావాల్సిందే. అబ్బాయిల కోసం ఫ్యాషన్ నిపుణులు చెప్పిన కొన్ని చిట్కాలు ఇక్కడ తెలుసుకుందాం



# అబ్బాయిలూ మీ కోసమే ఈ డ్రెస్సింగ్ టిప్స్.. ఫాలో అయితే అమ్మాయిలు చూపు తిప్పుకోలేరు.



### శరీర ఆకృతి..




లావుగా ఉన్న వ్యక్తులు టైట్ దుస్తుల్ని ఎంచుకోవద్దు. ఎందుకంటే టైట్ దుస్తుల్లో వారు పొట్ట బయటకు కనిపించే అవకాశం ఉంది. అందుకే మీ శరీర ఆకృతి బట్టి.. డ్రెస్సులు సెలెక్ట్ చేసుకోండి. సన్నగా ఉన్న అబ్బాయిలు కూడా దుస్తుల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు వదులు బట్టలు సెలెక్ట్ చేసుకోకండి. ఇలా చేయడం వల్ల వికారంగా కనిపించే అవకాశం ఉంది.

### బట్టల కలర్..



అబ్బాయిలు కూల్గా కనిపించాలంటే బట్టల రంగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఒకే రకమైన కలర్స్ వేస్తే అంతగా సూటవుతుంది. జీన్స్ ప్యాంట్ వేస్తే తనకి కాంట్రాస్ట్ కలర్ చొక్కా ధరించడానికి ట్రై చేయండి. అలాగే షర్ట్, టీ షర్ట్స్ కలర్ బట్టి.. కాంట్రాస్ట్ కలర్ ప్యాంట్స్ సెలెక్ట్ చేసుకోండి. ఏ కలర్ బట్టలు వేసుకుంటే మీరు బాగా కనిపిస్తారో.. ఒకటికి పది సార్లు చెక్ చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

### సరైన సైజ్..




సరైన సైజ్ డ్రెస్సులు సెలెక్ట్ చేసుకోవడంపై కూడా దృష్టి పెట్టాలి. సైజ్ ఎక్కువ ఉన్న బట్టలు వేసుకుంటే మీరు లావుగా కనిపిస్తారు. అందుకే స్లిమ్ ఫిట్ సైజుపై దృష్టి పెట్టండి. దుస్తులు కొనేటప్పుడే.. ఒకటి రెండు సార్లు మీ సైజు సరిచూసుకోండి. అంతేకాకుండా టైట్ దుస్తుల్ని కూడా సెలెక్ట్ చేసుకోవద్దు. ఇలా చేయడం వల్ల మీకు ఇబ్బందిగా అనిపించవచ్చు. టైట్ దుస్తుల్లో కొందరి లుక్ అస్సలు బాగోదు. అందుకే.. అసౌకర్యంగా ఉండే దుస్తుల్ని ఎంచుకోవద్దు.

### దుస్తులకు తగ్గ షూస్ ఎంపిక చేసుకోండి..



కేవలం దుస్తులు ధరిస్తే సరిపోదు. దానికి తగ్గ యాక్ససరీస్ కూడా ఉండాలి. ముఖ్యంగా షూస్ దుస్తులకు సరిపోయేలా ఉండాలి. జిమ్ వేర్ ధరిస్తే.. దానికి తగ్గ స్పోర్ట్ షూస్ ధరించండి. స్టైల్గా కనిపించడం కోసం డిఫరెంట్ స్నీకర్స్ వాడండి. బూట్లు మిమ్మల్ని చాలా స్టైలిష్గా కనిపించేలా చేస్తాయి. కాబట్టి సరైన షూస్ ఎంచుకోండి.

### జుట్టు, గడ్డం..



అబ్బాయిల అందంలో జుట్టు, గడ్డం కూడా కీ రోల్ ప్లే చేసాయి. ఎంత స్టైలిష్ బట్టలు వేసుకున్నా.. హెయిర్ స్టైల్ సరిగ్గా లేకపోతే.. మీ లుక్ అంతా పాడైపోతుంది. స్టైల్, కూల్ లుక్ కోసం మీ హెయిర్ స్టైల్ కీలకం. అంతేకాకుండా గడ్డం కూడా స్టైల్ లుక్ ఇస్తుంది. కొందరు గడ్డం ఉండే చాలా స్టైల్గా కనిపిస్తారు. కొందరు గడ్డం లేకపోతే బాగుంటారు. అందుకే హెయిర్ స్టైల్, గడ్డం విషయంలో జాగ్రత్తలు తీసుకోండి.

### వీ- నెక్ టీ షర్ట్స్..

టీ షర్ట్స్ వేసుకున్నప్పుడు కాలర్ నెక్ కాకుండా.. వీ నెక్ డ్రెస్సుల్ని ఎంపిక చేసుకోండి. ఇవి మిమ్మల్ని స్లిమ్గా కనిపించడంలో సాయపడతాయి. అంతేకాకుండా టీ షర్ట్ పొడువు మిమ్మల్ని లావుగా చూపిస్తుంది. అందుకే.. టీ షర్ట్ పొడువు కూడా చాలా ముఖ్యం. మీ హైట్కి తగ్గ టీ షర్ట్స్ ఎంపిక చేసుకోండి.

**గమనిక.** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.